క్లుప్తంగా

ఉచిత గ్యాస్ కనెక్షన్ తీసుకోండి

కర్లపాలెం: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అర్హులైన పేదలందరూ వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు ఎస్కే కరిముల్లా తెలిపారు. మంగళవారం హనుమాన్ సాయి గ్యాస్ ఏజెన్సీలో ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం పేద మహిళలకు ఆయన దరఖాస్తులు అందజేశారు. పొగ రహిత దేశంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉజ్వల యోజన పథకం ద్వారా పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారన్నారు.

వ్యాసరచన విజేతల ప్రకటన

సత్తెనపల్లి: గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా కవి కోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇటీవల వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సాహితీ సేవా సంస్థ అధ్యక్షుడు పి.యిర్మీయా, కార్యదర్శి ఎ.సురేష్‌బాబు మంగళవారం ఇంటర్మీడియట్ విభాగంలోని విజేతల వివరాలను వెల్లడించారు. 9వ. 10వ తరగతి విద్యార్థుల విజేతల వివరాలను బుధవారం ప్రకటిస్తామన్నారు. ఇంటర్మీ డియట్ విభాగంలో ప్రథమ స్థానం కె. శ్వేతా నందిని(సీనియర్ ఇంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్తెనపల్లి), ద్వితీయ స్థానం వి. కావ్య జెరూష (సీనియర్ ఇంటర్ వృందా కాలేజీ, సత్తెనపల్లి), తృతీయ స్థానం బి. సిరి (సీనియర్ ఇంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్తెనపల్లి) కైవసం చేసుకోగా కన్సోలేషన్‌కు ఎస్. రాజు (జూనియర్ ఇంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్తెనపల్లి), ఎండీ సన (సీనియర్ ఇంటర్ వృందా కాలేజ్, సత్తెనపల్లి), షేక్ సుమియా (సీనియర్ ఇంటర్ , వృందా కాలేజ్,సత్తెనపల్లి), ఎస్.కె. సానియా ముబీన్ (సీనియర్ ఇంటర్, వృందా కాలేజ్, సత్తెనపల్లి), సిహెచ్. సుకన్య (సీనియర్ ఇంటర్ , వృందా కాలేజ్, సత్తెనపల్లి) దక్కించుకున్నారు.

నేడు వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 బాల, బాలికల వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఈ నెల 27న జరుగుతాయని కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కావూరి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు క్రీడాకారులు రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దుద్దుల మురళి కృష్ణను సంప్రదించాలన్నారు. వారితో పాటు కళాశాల ఫిజిక్స్ డైరెక్టర్ దగ్గుబాటి.శివ బ్రహ్మరెడ్డి, కళాశాల ఏవో మాచిభట్లు సుబ్బారావు, అధ్యాపకులు ఉన్నారు.

రాయితీపై కంది విత్తనాల పంపిణీ



నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి, కుంకలగుంట గ్రామాల్లోని రైతులకు 80శాతం రాయితీపై మంగళవారం కందివిత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల పథకంలో భాగంగా ఎల్ఆర్‌జీ-52 రకం కంది విత్తనాలు పంపిణీ చేశామన్నారు. మార్కెట్ ధర కేజీ రూ.111.40లు కాగా 80శాతం రాయితీపై రూ22.28లకే పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, ఉపసర్పంచ్ జూపల్లి మోషె, సహాయకులు ఎం. ప్రసన్నకుమార్, ఎం.సంధ్యారాణి, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పిడుగురాళ్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నరసరావుపేట డీఎస్పీ మహేష్ మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలో విచారించారు. ఆగస్టు 28వ తేదీన రెంటచింతలలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ హనుమంతరావు దాచేపల్లి మండలానికి చెందిన వట్టిపు మరియదాసును దుర్భాషలాడి కులం పేరుతో దూషించినట్లు పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటన పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద జరిగిందని కేసు నమోదు అయింది. దీంతో వట్టిపు మరియదాసు కోరినమేరకు నరసరావుపేట డీఎస్పీ మహేష్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే డీఎస్పీ పిడుగురాళ్ల పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్దకు వచ్చి విచారించారని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు.

బంగారం, వెండి నగలు చోరీ

మాచవరం: ఇంట్లో ఎవరూలేని సమయంలో బంగారం, వెండి నగలు చోరీకి గురైన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు జానీ బాషా సొంత పనుల నిమిత్తం కుటుంబీకులతో కలిసి సోమవారం పిడుగురాళ్ల బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటి పక్కన సోదరుడు పొలం పనులకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన బాధితుని తాతయ్య జాను విషయాన్ని జానీబాషాకు తెలియజేశారు. ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో దాచిన సుమారు రూ.1లక్షా 92 వేలు విలువ చేసే బంగారం, వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు.

పీఎంశ్రీతో డిజిటల్ సొబగులు

- ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రమాణాల పెంపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం
- నియోజకవర్గం నుంచి నాలుగు పాఠశాలల ఎంపిక
- మరో 8 స్కూళ్లకు ప్రతిపాదనలు



పీఎంశ్రీకి ఎంపికైన బృగుబండ జెడ్పీ ఉన్నత పాఠశాల

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టడంతో పాటు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్ (పీఎంశ్రీ) అనే పేరుతో ఓ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యంతో కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని విద్యాశాఖ చెబుతోంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే.. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

నియోజకవర్గంలో 12 పాఠశాలలు ఎంపిక ...

పీఎంశ్రీ పథకం కింద గతేడాది మండలానికి ఒక్కో పాఠశాల చొప్పున నియోజక వర్గ వ్యాప్తంగా నాలుగు స్కూళ్లు ఎంపిక కాగా ఈ ఏడాది మండలానికి రెండు స్కూళ్లు చొప్పున ఎనిమిది ఎంపిక చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. నియోజకవర్గంలో తొలి విడతగా 2021-22 యూ డైస్ జాబితా ఆధారంగా 46 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని నాలుగు పాఠశాలలను గుర్తించారు. రెండో దశలో ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ప్రతి మండలం నుంచి 20 పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని అందులో నుంచి రెండు స్కూళ్లను ఎంపిక చేస్తామని ఆయా మండలాల్లోని విద్యాశాఖ ఇప్పటికే ప్రకటనలు విడుదల చేసింది. 60 శాతం ఫలితాలు సాధించిన గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను పీఎంశ్రీ పథకం ఎంపికలో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

మౌలిక వసతులు, సౌకర్యాల పెంపు ....

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయాలు మరింతగా మెరుగు పరుస్తారు. అంతేకాకుండా అదనపు తరగతి గదులు నిర్మిస్తారు. అదనపు వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రిని సమకూరుస్తారు. ఏ మేరకు పనులు చేపట్టాలనే అంశంపై జిల్లాస్థాయి కమిటీలు ప్రతిపాదనలు మేరకు చర్యలు తీసుకుంటారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.



నిర్మాణంలో ఉన్న భవనం

ప్రధానోపాధ్యాయుల నుంచే ప్రతిపాదనలు..

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో ఎలాంటి అదనపు వసతులు కావాలనే అంశంపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే నివేదికలు సమర్పించాలి. ఈ నివేదికలు రూపొందించే ప్రక్రియపై ఇప్పటికే విద్యాశాఖ హెచ్‌ఎంలకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. త్వరలో ప్రధానోపాధ్యాయులు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్ష అభియాన్‌కు పంపుతారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించిన అనంతరం వాటిని కేంద్రానికి పంపుతారు. ఈ పథకం కింద ఐదేళ్ల పాటు పాఠశాలలకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాడు - నేడు'పథకం వల్ల రాష్ట్రంలోని పాఠశాలల రూపు రేఖలు మారాయి. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులకు సాంకేతికతను జోడిస్తున్నారు. తరగతి గదులను డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దనున్నారు.

పీఎంశ్రీతో ప్రయోజనాలెన్నో..

- ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నేరుగా నిధులు కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు
- ప్లాస్టిక్ రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం
- సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన
- హరిత పాఠశాలలుగా మార్చడం

-బడి ఆవరణలో సేంద్రియ విధానంతో కూరగాయలు, ఆకుకూరల సాగు

- దివ్యాంగ విద్యార్థులకు బోధన పరికరాల ఏర్పాటు
- అందుబాటులోకి గ్రంథాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత మహర్దశ పట్టనుంది. విద్యార్థులకు నాణ్యమైన బోధనన అందించడానికి దోహదపడుతుంది. కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు తయారవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 'నాడు - నేడు' పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారు. ఇపుడు పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు త్వరలో డిజిటలైజ్డ్ తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు, బోధన సామగ్రి సమకూరనున్నాయి. విద్యార్థులు విద్యలో మరింతగా రాణించేందుకు అవకాశం లభిస్తుంది.

ఎ.శ్రీనివాసరావు,
మండల విద్యాశాఖాధికారి, సత్తెనపల్లి.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్బారావు

అమరావతి: ప్రతి ఒక్కరూ దృష్టి లోపం సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలని మండల కంటి వైద్యాధికారి సుబ్బారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వారం నుంచి మండల పరిధిలోని పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో 12 పాఠశాలల్లో 2,257మంది విద్యార్థులకు కంటీపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో 90 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, కళ్లజోళ్లకు సిఫారసు చేశామని చెప్పారు. తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు విద్యార్థులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. మిగిలిన 2,164 మందికి ఎటువంటి కంటి సమస్యలు లేవన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

స్వచ్ఛతా హి సేవ



మానవహారంగా విద్యార్థులు

క్రోసూరు: స్థానికంగా పంచాయతీ సిబ్బంది పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ, మానవహారం మంగళవారం చేపట్టారు. క్రోసూరు బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పాడి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై ప్లకార్డుకలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి నాయక్ పాల్గొన్నారు.



మాదలలో ర్యాలీ

మాదలలో స్వచ్ఛతయే సేవా ర్యాలీ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో స్వచ్ఛతా హి సేవా అవగాహన ర్యాలీ మంగళవారం జరిగింది. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అందరూ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంఆర్పీ బ్రహ్మనందం, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన

- చేర్పులు, మార్పులపై పార్టీల ప్రతినిధులకు అవగాహన ఉండాలి
- ఇన్‌చార్జి ఎన్నికల అధికారి మీసాల దానియేలు

పిడుగురాళ్ల: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన ఉండాలని గురజాల ఇన్‌చార్జి ఎన్నికల అధికారి గురజాల తహసీల్దార్ మీసాల దానియేలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గురజాల నియోజకవర్గ స్థాయి అన్ని పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం ఎన్నికల అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దానియేలు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నూతన ఓట్లు చేర్చటం, మరణించిన వారి ఓట్లను తొలగించటం, అడ్రస్‌లు మార్పులు, చేర్పులు చేయటం, వేర్వేరు ప్రాంతాలలో ఓట్లు ఉన్నవారికి ఒక ప్రాంతంలో ఓటు ఉండేవిధంగా చూడటం వంటి కార్యక్రమాలను బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అన్ని పార్టీల నాయకులు స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. అలాగే తక్కెళ్లపాడు ఎన్నికల బూత్ మార్పు విషయమై అధికారులను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణలో జరిగే విధంగా చర్యలు చేపట్టినట్టు అధికారులు బదులిచ్చారు. అలాగే ఎన్నికల నిర్వాహణ అంశంపై పలు సూచనలు, సలహాలను రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, గురజాల కమిషనర్ మోహన్ శ్రీనివాస్, తహసీల్దార్లు చక్రవర్తి, ప్రసాద్, జి.కరుణకుమార్, ఆయా పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మాచవరం: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ జె.శివాయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులను శుభ్రపర్చారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమల వలన కలిగే సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు శివారెడ్డి, పెరుగు రోశయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌ఓ వై.అఖిల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మామిడి, బత్తాయిలో యాజమాన్య పద్ధతులు కీలకం



నకరికల్లు: ఉద్యాన పంటలైన మామిడి, బత్తాయి తదితర పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఆదాయం సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి డి.నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉదయ్‌నగర్ కాలనీ, శివాపురం తండాల్లో సాగులో ఉన్న పండ్ల తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. మామిడి, బత్తాయి, బొప్పాయి సాగుచేస్తున్న పలువురు రైతులతో మాట్లాడి పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ప్రభాకర్, నాబార్డు అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు మృతి

నరసరావుపేట టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 18వ తేదీన పాతూరుకు చెందిన ఆవుల వెంకట శివసాయి (18) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. తండ్రి ద్విచక్రవాహనం ఇప్పించలేదన్న క్షణికావేశంతో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకుతరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా రవి

ఈపూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా సీహెచ్ వెంకట రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



మిరియాల గణేష్

నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన మిరియాల గణేష్ (12) పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి వినాయకుడి నిమజ్జన ఊరేగింపు తిలకించేందుకు కోట సెంటర్‌కు వచ్చాడు. అక్కడ వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దిమ్మె ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు కర్ర సహాయంతో బాలుడిని పక్కకు నెట్టారు. వెంటనే 108 సహాయంతో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు మృతుడి తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

నేడు పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం

అచ్చంపేట: స్థానికంగా రూ.2.50కోట్ల నిధులతో అధునాతన వసతులతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నేడు రాష్ట్ర హోం మినిస్టర్ తానేటి వనిత ప్రారంభించనున్నారు. అత్యాధునిక వసతులతో రెండు అంతస్తుల్లో భవన నిర్మాణం జరిగింది. మొత్తం 16గదులు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు లాకప్ గదులు, కంప్యూటర్ రూం, ఇంటరాగేషన్ గది, మానిటరింగ్ గది, స్టేషన్ హౌస్ ఆఫీసర్ గది, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గది, ఏఎస్‌ఐ గది, సువిశాలమైన సమావేశపు హాలు, వంట గది, డైనింగ్ హాల్, డార్మిటరీ, భవన పైభాగాన 24/7 కాచుకుని విధులు నిర్మించే సెంట్రీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హాజరుకానున్న ప్రముఖులు

పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నర్సరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే లావు శ్రీకృష్ణ దేవరాయలు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఐజీ జె.పాల్‌రాజ్, పల్నాడు జిల్లా ఎస్పీ, వై.రవిశంకర్‌రెడ్డి హాజరుకానున్నారు.

మోడల్ పోలీస్ స్టేషన్‌గా..

బ్రిటీష్‌వారు అచ్చంపేట నడిబొడ్డులో పోలీస్ స్టేషన్‌కు 20ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అంత స్థలంలో నిర్మించిన చిన్న స్టేషన్‌లో ఇప్పటి వరకు ఎలాంటి సౌకర్యాలు లేవు. అయితే ఇక్కడ ఒక మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలన్న ఆలోన చేశారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీయం వెంటనే స్పందించి రూ.2.50కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇప్పుడు పెదకూరపాడు నియోజకవర్గంలోనే అన్ని వసతులు, సౌకర్యాలున్న అతిపెద్ద పోలీస్ స్టేషన్‌గా అచ్చంపేటను చెప్పుకోవచ్చు. ఇటీవల రూ.1.50కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ ప్రారంభించారు.



అధునాతన సౌకర్యాలతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనం

ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలి

బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య



మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని తాళ్లచెరువు ఆర్సీఎం దేవాలయంలో మంగళవారం రాత్రి జరిగిన 13 మంగళవారోత్సవాలలో ఆయన పాల్గొని, సర్వమత ప్రార్థనలు చేశారు. తుమ్మా శౌర్రెడ్డి, ఇన్యాసమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బాలసాయిరెడ్డి విరాళంగా ఇచ్చిన రూ.1.50లక్షలతో తయారు చేయించిన దేవాలయ ముఖద్వారం గేటును ఆయన ప్రారంభించారు. ఏసుక్రీస్తు స్వరూపాన్ని గ్రామానికి చెందిన ఏరువ వెళాంగిణిరెడ్డి, ప్రమీల దంపతులు బహూకరించారు. పీఠాదిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య గురుపట్టాభిషేకం పొంది 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవం నిర్వహించారు. గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ భాగ్యయ్య గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పుట్టి అంతోనిరాజు, ఫాదర్ కిరణ్, కన్యాస్త్రీలు, గ్రామ పెద్దలు , దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష ఇంటింటి సర్వే మంగళవారం ముమ్మరంగా చేపట్టారు. ప్రతి ఇంటిలోని వ్యక్తుల ఆరోగ్యసమాచారం తెలుసుకుని వారి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షేక్ మహేబూలాబీ, ఏఎన్‌ఎంలు, ఆశలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలపై అవగాహన

రాజుపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో టోకెన్స్ తీసుకున్న ప్రతి ఒక్కరూ మెడికల్ క్యాంప్‌కి వచ్చేలా.. చూడాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి కేవీ కృష్ణకుమార్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే లక్ష్యాలను మెడికల్ క్యాంప్‌లు నిర్వహించే విధానంపై సిబ్బందికి అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 30 నుంచి నిర్వహించే మెడికల్ క్యాంప్‌లో 14 రకాల రక్త పరీక్షలు, 105 రకాల మందులను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కృష్ణకుమార్

ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలి

పెరికపాడు(క్రోసూరు): ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, నమోదు చేయాలని పెరికపాడు గ్రామ సర్పంచ్ ఊడల శ్రీధర్ కోరారు. గ్రామ సచివాలయంలో మంగళవారం వైద్య సిబ్బందితో సర్పంచ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షల అనంతరం అక్టోబర్ 13న వైద్య శిబిరంలో పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. గ్రామ కార్యదర్శి రవికుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువతి దుర్మరణం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అశ్విని

రొంపిచర్ల: వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పైన గల సిమెంట్ పోల్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువతి కిందపడి మృతి చెందిన ఘటన మండలంలో తుంగపాడు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేటకు చెందిన ఓ ఈవెంట్స్‌లో అశ్విని (22), మున్నా అనే యువతీ యువకులు పని చేస్తున్నారు. సోమవారం రాత్రి డాన్స్ ఈవెంట్‌కు హాజరై రొంపిచర్ల మీదుగా నరసరావుపేటకు బైక్ మీద వస్తుండగా తుంగపాడు గ్రామ సమీపంలో గల బ్రిడ్జీ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ కింద పడిపోవడంతో బైక్ నడుపుతున్న మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్ వెనుక కూర్చున్న అశ్విని రోడ్డు ప్రక్కన గల కాలువలో పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నరసరావుపేట వైపు వెళ్తున్న వారు అక్కడ పడి ఉన్న వీరిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో పడిన అశ్విని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అదే విధంగా తీవ్ర గాయాలైన మున్నాను చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా మృతురాలు అశ్విని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. మున్నా నరసరావు పేటకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సి.హెచ్. సురేష్ బాబు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి

మాచవరం: అనారోగ్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన సఫావత్ జ్యోతిభాయి (32) ఏడాది క్రితం ప్రమాదానికి గురికాగా, ప్రమాదంలో కాలికి బలమైన గాయాలయ్యాయి. ఆపరేషన్ అనంతరం కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఉంది. కాళ్ల నొప్పులు భరించలేక ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు.